క్రీస్తు మార్గం.. ఆదర్శప్రాయం

● నేడు గుడ్ ఫ్రైడే ● చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు



కడప కల్చరల్ : గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని కడప నగరంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా శుక్రవారం మరియాపురంలో ఉదయం 10.00 నుంచి శిలువ మార్గం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గురువులు, భక్తులు క్రీస్తు శిలువను మోసిన ఘట్టాన్ని గుర్తుకు తెస్తూ తాము కూడా శిలువను మోసి భక్తిని చాటుకుంటారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

– స్థానిక సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో ఉదయం 11.30 గంటల నుంచి శుభ శుక్రవారపు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ గురువులు ప్రభువు శిలువపై శిక్షింపబడిన సందర్భంగా పలికిన ఏడు మాటలపై ధ్యానం కార్యక్రమం నిర్వహిస్తారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో కడప నగరంలోని అన్ని క్రైస్తవ పీఠాల బిషప్‌లు, పాస్టర్లు, ప్రముఖ గురువులతోపాటు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొంటారు. చర్చి వద్ద ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం వన్‌టౌన్, అప్సర, ఆర్టీసీ బస్టాండు కూడళ్ల మీదుగా తిరిగి చర్చికి చేరుకుంటుంది. ఆదివారం ఈస్టర్ సండే సందర్భంగా క్రీస్తు పునరుత్థాన శుభ ఘడియలను పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుంచి చర్చిలో ప్రత్యేక సర్వీసు ఉంటుంది. ఇందులో బిషప్ పాల్గొంటారు.

క్యాథడ్రల్ చర్చిలో..

క్యాథడ్రల్ చర్చి వద్ద ఉదయం 10 గంటలకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువమార్గం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులతో కలిసి సామూహికంగా క్రీస్తు ఆరాధన గీతాలను ఆలపిస్తూ మరియాపురం మెయిన్‌రోడ్డు వద్దగల మారెమ్మ ఆలయం నుంచి ఊరేగింపు నిర్వహిస్తారు. మరియాపురం గ్రామం నుంచి పెద్ద చర్చి వద్దకు చేరుకుని అక్కడ ప్రార్థనలు నిర్వహిస్తారు.

ఆరోగ్యమాత చర్చిలో..

గుడ్‌ఫ్రైడే సందర్భంగా కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు డాన్ బాస్కో ఐటీఐ చర్చి వద్ద నుంచి పరిశుద్ధ శిలువమార్గం ఊరేగింపుగా ఆరోగ్యమాత చర్చికి చేరుతుంది. సాయంత్రం శిలువ ఆరాధన, దైవ వాక్యార్చన, దివ్య సత్ప్రసాద స్వీకరణ ఉంటాయి. శనివారం రాత్రి నుంచి పాస్కా జాగరణ పేరిట ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఈస్టర్ సండేను పురస్కరించుకుని ఉదయం పాస్కా మహోత్సవ దివ్య బలిపూజ నిర్వహించనున్నారు. ఆరోగ్యమాత చర్చి విచారణ గురువుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రభువు సేవా మార్గాన్ని మనం పాటించాలి

కడప కల్చరల్ : గుడ్‌ఫ్రైడే కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా మరియాపురంలోని క్యాథడ్రల్ చర్చి ఆవరణలో విచారణ గురువులు ఫాదర్ ఈరి మరియన్న 12 మంది శిష్యుల పాదాలను కడిగారు. ఏసుక్రీస్తు తన శిష్యుల పాదాలను కడిగిన ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో కడరాత్రి భోజన ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ క్షేత్రం విచారణ గురువు 12 మంది శిష్యుల పాదాలను కడిగారు. ఈ సందర్భంగా ఫాదర్ ఈరి మరియన్న మాట్లాడుతూ సమాజానికి సేవకుడిలా పనిచేసిన వారే నిజమైన నాయకుడన్నారు. సకల జాతి జనులకు సేవలు చేయాలని సూచించిన ప్రభువు సేవా మార్గమే మనకు ఆదర్శమన్నారు. తనను తాను తగ్గించుకునువాడే హెచ్చింప బడతాడని ఆయన తెలిపాడన్నారు. నాయకుడన్న వాడు క్రీస్తు ప్రభువు నుంచి నాయకత్వ లక్షణాలను నేర్చుకోవాలన్నారు. తన శిష్యులలో ఒకడు తనను శత్రువులకు అప్పగించనున్నాడని తెలిసి కూడా అతడిని ప్రేమించిన గొప్ప వ్యక్తి క్రీస్తు ప్రభువు అని కొనియాడారు.



శిష్యుల పాదాలు కడుగుతున్న క్రైస్తవ గురువు

తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలి



ప్రభుత్వ విప్ మాధవికి వినతి పత్రం సమర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: అనేక ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను అరవై ఏళ్ల వయసు వచ్చిందని తొలగించడం అన్యాయమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) నాయకులు తెలిపారు. గురువారం ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డిలకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నలభై ఏళ్లుగా సేవ చేసిన కార్మికులను ఖాళీ చేతులతో ఇంటికి పంపడం సరైంది కాదన్నారు. వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలన్నారు. కార్పొరేషన్ జనరల్ బాడీలో పెట్టి కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలన్నారు. జీఓ నంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు రూ.24500 ఇవ్వాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఫోన్ చేసి కార్మికులకు న్యాయం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ సహాయ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి. పర్మినెంట్ నాయకులు కొండయ్య, శ్యాం బాబు.అజాముద్దీన్ బాషా, ప్రసన్న కుమార్. రమేష్ బాబు, మణి, సుబ్బారాయుడు, శ్రీను. చంద్రపాల్. రామసుబ్బారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ప్రకటన విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ, భిక్షాటన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ఓటేసిన పాపానికి నిరుద్యోగులను దారుణంగా మోసం చేసిందని ధ్వజమెత్తారు. డీఎస్సీపై మొదటి సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చి పది నెలలైనా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియ చేపడతామని చెప్పి వివిధ కారణాల పేరుతో నిరుద్యోగులకు జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్,కడప నగర కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతోపాటు క్రీడా స్ఫూర్తిని అభివృద్ధి చేసుకోవాలని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మునీష్ మీనా కోరారు. కడప పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హైదరాబాద్ రీజినల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీలకు హైదరాబాద్ రీజియన్ పరిధిలోని 29 కేంద్రీయ విద్యాలయాల నుంచి అండర్ 14, 17, 19 విభాగాల్లోని బాల, బాలికలు హాజరయ్యారు. ఈ పోటీలు వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 16వ తేదీ ప్రారంభమై 17వ తేదీలో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మునీష్ మీనా ప్రసంగిస్తూ దాదాపు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 29 స్కూల్స్‌కి చెందిన 116 మంది విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆరోగ్యకరమైన పోటీతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీలు ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జిలానిబాష పర్యవేక్షణలో సాగాయి. ఇక్కడ విజయం సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని డిపోలలో కొనసాగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొన్నారు. గేట్ మీటింగ్ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఎటువంటి స్పందన లేనందున ప్లకార్డుల ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతా సర్క్యులర్ 1/2019 ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా కొనాలని, 114 జీవో లో పొందపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌ను 150 నుంచి 400 వరకు చెల్లింపులు చేయాలన్నారు. వీటితోపాటు ఇతర అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కడప రీజియన్ ప్రెసిడెంట్ నాగముని, రీజియన్ సంయుక్త కార్యదర్శి దాస్, డిపో కార్యదర్శి శ్రీను, కోశాధికారి బాషా, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, రామచంద్ర, సుబ్బమ్మ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు

ఘనంగా ప్రసన్న విశ్వేశ్వరుని కల్యాణోత్సవం

కడప కల్చరల్: కడప నగరం మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో అర్చకుల బృందం తొలుత ఆలయంలోని మూలమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. అనంతరం ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. అర్చకులు కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా భక్తులు శివనామ స్మరణలు చేశారు. అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల సుస్వరాల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సాహ భరితంగా అక్షరారోపణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాజ్యాంగం అంటే రిజర్వేషన్లు కాదు.. ప్రజలందరి హక్కు

కడప ఎడ్యుకేషన్: రాజ్యాంగం అంటే రిజర్వేషన్లు కాదు ప్రజలందరి స్వేచ్ఛ సమానత్వ హక్కులు అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో గురువారం ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవాల సందర్భంగా విశ్వవిద్యాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు, ప్రిన్సిపల్ ఎస్ రఘునాథ్ రెడ్డి, రిజిస్టర్ పి పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు, బోధ నేతర సిబ్బంది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనెట్ హాల్లో ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం ఎం వినోదిని అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పెద్ద కులం అనుకునే వాళ్లంతా మానసిక వ్యాధితో ఉన్నట్టుగా భావించవచ్చు అన్నారు. అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఇలా కొల్లగొట్టి సంపదను దోచుకున్నారని నేడు సెల్ ఫోన్లు, సోషల్ మీడియా మీ స్వేచ్ఛను దోచుకుంటోందన్నారు. ప్రిన్సిపల్ ఎస్ రఘునాథ్ రెడ్డి , కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ , ఎస్సీ ఎస్టీ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు ఆచార్య కె. గంగయ్య, డీన్ ఆచార్య ఏజి దాము మాట్లాడారు.



పూలే, జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న వైవీయూ వీసీ తదితరులు

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

కడప అర్బన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని గురువారం సందర్శించారు. భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కోరారు. వేసవిలో పిల్లల విద్య, ఆరోగ్యం పై జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య, సీపీఓ సుభాష్ యాదవ్, వైద్యాధికారిణి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్: అగ్ని ప్రమాదాలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కలిగి ఉండాలని జిల్లా విపత్తు స్పందన, జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు అన్నారు. కడప నగరంలోని చెమ్మియాపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా డెమో నిర్వహించి అగ్ని ప్రమాదాలను ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయాలను తెలియజేశారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి, రెడ్ క్రాస్ అధికారి సురేష్‌కుమార్, రెడ్ క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్ బాబు, హెచ్‌ఎం గిరిజాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీలో పలువురి నియామకాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా కాంగ్రెస్ కమిటీకి కొత్త కార్యవర్గాన్ని నియమించినట్లు డీసీసీ అధ్యక్షురాలు ఎస్ డి విజయ జ్యోతి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యక్షులుగా టీ.సుబ్రమణ్యం (వేంపల్లి), సిరాజుద్దీన్ (కడప), కె.ప్రసాద్ గౌడ్ (కడప), ప్రధాన కార్యదర్శులుగా సయ్యద్ గౌస్ పీర్ (కడప), సులోచనమ్మ (ఎర్రగుంట్ల) వై.అచ్యుత రాజు (బద్వేలు), పి.శివారెడ్డి (కమలాపురం), కార్యదర్శులుగా కె.బీ.ఏకాదశి రెడ్డి (పెండ్లిమర్రి మండలం), పి.చిన్న వెంకట స్వామి (జమ్మలమడుగు), ఎస్.అమరనాథ్ రెడ్డి (బి.మఠం), ఎ.యల్లయ్య (ప్రొద్దుటూరు), జి.రమేష్ (పులివెందుల) నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులు రక్షణ కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అహ్మద్‌ఖాన్

కడప కార్పొరేషన్: తమపై అన్యాయంగా కేసు బనాయించి...దాడులు చేస్తున్న వారి నుంచి పోలీసులు రక్షణ కల్పించాలని అల్మాస్‌పేటకు చెందిన షబ్బీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం ఆయన తన స్వగృహం వద్ద మీడియాతో మాట్లాడుతూ కుటుంబ కలహాల నేపథ్యంలో తమపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, ఈ కేసు వాయిదా కోసం ఈనెల 7వ తేది తాము కోర్టుకు వెళుతుంటే ప్రత్యర్థులైన జమీల్‌ఖాన్, మహమ్మద్‌ఖాన్ మరో ఇద్దరితో కలిసి దాడి చేశారన్నారు. ఈ దాడిలో తాను గాయపడి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇప్పుడు మీడియా ముందుకొచ్చానన్నారు. పదే పదే దాడులు చేస్తూ తమను బెదిరిస్తున్న వారి నుంచి పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. వారు దాడి చేసిన విషయాన్ని న్యాయస్థానం దృష్టికి కూడా తీసుకుపోతామని తెలిపారు.

వ్యవసాయ విస్తరణకు డ్రోన్ల వినియోగం అవసరం

– జేసీ అదితిసింగ్



అధికారులతో కలిసి కిసాన్‌డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

కడప అగ్రికల్చర్: గ్రామీణ ప్రాంత వ్యవసాయ విస్తరణకు డ్రోన్ల వినియోగం ఎంతో అవసరం అని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. గురువారం కడప కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కిసాన్ డ్రోన్లపై గ్రూపు కన్వీనర్లకు, డ్రోన్ పైలెట్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి లీడ్ బ్యాంక్ మేనేజర్ జనార్దన్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, యూనియన్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రెడ్డెయ్య, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి, కిసాన్ డ్రోన్ గ్రూపు కన్వీనర్లు, డ్రోన్ పైలెట్లు, డ్రోన్ కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిసాన్ డ్రోన్లతో మందుల పిచికారీ సులభతరం అవడంతోపాటు మందుల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు.

వైవీయూ అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 100 కోట్ల నిధులు కేటాయించాలని, అలాగే ఇంజనీరింగ్, లా, బి.ఎడ్, ఫార్మసి కోర్సులను కూడా ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం వైవీయు సర్ సి. వి.రామన్ సైన్స్ బ్లాక్ ముందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగి వేమన విశ్వ విద్యాలయం ఏర్పాటై రెండు దశాబ్దాలు కావస్తున్నా నిర్మాణం ఆగిపోయిన భవనాలకి నిధులు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ఎ జిల్లా అధ్యక్షులు నవీన్, వైవీయు నాయకులు మహేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అపోహలు విడనాడాలి



మాట్లాడుతున్న డాక్టర్ శశిబిందు

కడప కోటిరెడ్డిసర్కిల్ : లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ పై అపోహలు విడనాడాలని, లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్లల్లోని కార్నియా వొంపును సరిదిద్దడం ద్వారా రోగికి కళ్లద్దాల అవసరం లేకుండా సహాయపడే ఓ ప్రక్రియ అని ఎల్వీపీఈఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శశిబిందు తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైయస్ రాజశేఖర్ రెడ్డి క్యాంపస్‌లో లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సను సాధారణంగా మైయోపియా (హ్రస్వ దృష్టి), హైపర్‌మెట్రోపియా (దూర దృష్టి లోపం), ఆస్టిగ్మాటిజం (వక్రదృష్టి) లను సరిచేయడానికి చేస్తామన్నారు. రోగి వయస్సు కనీసం 21 సంవత్సరాలు ఉండాలని, కనీసం ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టిని కలిగివుండాలన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలు అనేక రకాలుగా ఉన్నాయని, కంటి నిర్దిష్ట అవసరాల ఆధారంగా నేత్ర వైద్యులు సూచిస్తారన్నారు.

సచివాలయం ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని 27వ డివిజన్‌లో అంగన్‌వాడీ, సచివాలయాలను ఏర్పాటు చేయడంతోపాటు పార్కును ఏర్పాటు చేయాలని 25వ డివిజన్ వాసులు కోరారు. ఈ విషయమై గురువారం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌస్‌నగర్ సమీపంలో 55 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయంతోపాటు కాలనీ వాసుల పిల్లల కోసం పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాల పక్కనే ఒక పెద్ద మురికి కాలువ ఉందన్నారు. దీంతో ఇబ్బందిగా ఉందన్నారు. స్పందించి ఆ స్థలంలో వీటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయఖ్ పటాన్ ఖాదర్‌బాషా, స్థానికులు పాల్గొన్నారు.

ఈ ఆఫీస్‌పై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈ ఆఫీసు ప్రతినిధి శివాంజనయ్య

కడప ఎడ్యుకేషన్: ఈ ఆఫీసుపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి అన్నారు. గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమాటిక్స్ ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఈ ఆఫీస్‌పై వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గురవిరెడ్డి మాట్లాడుతూ ఆఫీసుకు సంబంధించిన ప్రతి ఒక్కరు ఈ ఆఫీసుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ ఆఫీసు వలన అన్ని రకాల పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ ఆఫీస్ ప్రతినిధి శివాంజనయ్య ఈ ఆఫీసు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ స్వరూప, సూపరింటెండెంట్ జమయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు, విజయభారతి, మేరీసుధ, రవణమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

నిందితుడికి ఆరు నెలల జైలు

కడప అర్బన్: కడప నగరంలోని జిల్లా కోర్టు ఆవరణంలో 2020 ఫిబ్రవరి 17న ఓ కేసు విషయమై ఏపీఎస్ఆర్టీసీ కండక్టర్ జీడి నరసింహమూర్తి కోర్టుకు హాజరయ్యారు. సదరు కేసులో నిందితుడికి ఏడాదిపాటు జైలు శిక్షతో పాటు రూ.1,35,000 డబ్బులు చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు. తన నేరం నిరూపణ కావడంతో నిందితుడు కోర్టు వద్ద నుంచి దూకుడుగా పరారయ్యాడు. నిందితుడిపై మొబైల్ కోర్టు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి.రామకృష్ణ కేసు నమోదు చేసి, చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడికి గురువారం 6 నెలల జైలు శిక్షతోపాటు రూ. 2వేలు జరిమానా విధిస్తూ కడపలోని మొదటి అదనపు జ్యుడిషియల్ కోర్టు జడ్జి జె.నందిని తీర్పును ఇచ్చారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. శ్యాంసుందర్ రెడ్డి వాదించారు.

ఎస్పీ తనిఖీ

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఇటీవల వరుసగా జరుగుతున్న వివిధ నేరాల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. కాగా కడప బిల్టప్ సర్కిల్‌లో ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

వల్లూరు: మండలంలోని పైడికాలువలో గురువారం 12 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు. వారి వద్ద నుంచి రూ 2,52,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.